ఆ అవసరానికి ఇబ్బందులు!

- నూజివీడు పట్టణంలో కనిపించని మరుగుదొడ్లు, మూత్రశాలలు
- పట్టణానికి రోజూ వేలాదిమంది రాకపోకలు
- ప్రకృతి అవసరాలు తీర్చుకునేందుకు ప్రజల ఇబ్బందులు
- అత్యవసరమైతే బస్‌స్టాండ్‌కు వెళ్లాల్సిందే
- మరుగుదొడ్లు నిర్మించాలని ప్రజల వినతి



శిథిలావస్థకు చేరడంతో గతంలో కూల్చివేసిన సామూహిక మరుగుదొడ్లు (ఫైల్)

నూజివీడు: ఆరు మండలాలకు రెవెన్యూ డివిజన్ కేంద్రమైన నూజివీడు పట్టణం రోజురోజుకు అభివృద్ధి చెందుతోంది. డివిజన్ స్థాయి కార్యాలయాలతోపాటు మండల స్థాయి కార్యాలయాలు, కోర్టులు, విద్యా సంస్థలు, వ్యాపార సమూహాలు, ఆస్పత్రులు, వర్తక, వాణిజ్యాలు అభివృద్ధి చెందుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు అవసరాల నిమిత్తం నియోజకవర్గం నుంచే కాకుండా రెవెన్యూ డివిజన్‌లోని ఆరు మండలాల నుంచి ప్రతి రోజూ వేలాది మంది మహిళలు, పురుషులు నూజివీడు వస్తున్నారు. వారి పనుల నిమిత్తం ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలోనే ఉంటున్నారు. పట్టణంలో సామూహిక మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజలు ప్రకృతి అవసరాలు తీర్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మహిళల ఇబ్బందులు వర్ణనాతీతం

పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారే కాకుండా దుకాణాలలో పనిచేసే గుమస్తాలు, కొనుగోలుదారులు, ఇతరులు కూడా మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నారు. పురుషులైతే మూత్ర విసర్జనకు ఖాళీ ప్రదేశాలను ఆశ్రయిస్తున్నారు. మహిళల పరిస్థితి అత్యంత దారుణంగా ఉంటోంది. సమీపంలోని గృహాల వారిని బతిమిలాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. టాయ్‌లెట్లకు వెళ్లాలంటే ప్రతి ఒక్కరూ బస్టాండుకు పరుగులు పెట్టాల్సి వస్తోంది.

కార్యాచరణకు నోచుకోని ప్రతిపాదనలు

70 వేల జనాభా కలిగి పురపాలక సంఘంగా మారి సుమారు 37 ఏళ్లు గడిచినా పట్టణంలో సులభ్ కాంప్లెక్స్ తరహాలో మరుగుదొడ్లు లేవు. 2002లో ఎస్సీ కార్పొరేషన్ నిధుల నుంచి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో సులభ్ కాంప్లెక్స్ తరహాలో మరుగుదొడ్లు నిర్మించాలని ప్రతిపాదనలు చేసినప్పటికీ అవి కార్యాచరణకు నోచుకోలేదు. వామపక్షాలతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు గతంలో ఈ సమస్యపై పలుమార్లు ఆర్డీఓకు వినతిపత్రాలు అందజేశారు. గతంలో అమెరికన్ ఆస్పత్రి పక్క వీధిలో సామూహిక మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ వాటి నిర్వహణను గాలికి వదిలివేయడంతో అవి శిథిలావస్థకు చేరాయి. దీంతో వాటిని 2018లో కూల్చివేశారు. గతంలో మైలవరం రోడ్డులోని బస్టాప్ పక్కన పేతురు వాగుపై సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారే కాని ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు సులభ్ కాంప్లెక్స్ తరహాలో మరుగుదొడ్లు నిర్మించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మరుగుదొడ్లు నిర్మించాలి



మరుగుదొడ్లు లేక ముఖ్యంగా మహిళలు నరకయాతన అనుభవిస్తున్నారు. మరుగుదొడ్లు నిర్మించాలని కోరుతూ మున్సిపల్ అధికారులకు, ఆర్డీఓకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పట్టణంలో రెండు, మూడు ప్రాంతాల్లోనైనా మరుగుదొడ్లు నిర్మించాలి.

– జి.రాజు, సీపీఎం, నాయకులు

క్లుప్తంగా

సీజనల్ వ్యాధుల నివారణకు మందుల పంపిణీ

ఆగిరిపల్లి: చొప్పరమెట్లలో 3,500 మందికి హోమియో మందులు పంపిణీ చేశామని ఆగిరిపల్లి హోమియో వైద్యులు రజిత తెలిపారు. ఆమె మాట్లాడుతూ చొప్పరమెట్ల పంచాయతీ పరిధిలోని తాడేపల్లిలో జ్వరాలు, కీళ్లవాతంతో బాధపడుతున్న వారికి, సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా ఇంటింటికీ తిరిగి హోమియో మందులు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో సగ్గూరు పీహెచ్‌సీ వైద్యులు మంజుల, పంచాయతీ కార్యదర్శి మీర్జావలి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.30 వేల విరాళం



మైలవరం: మైలవరం మండలం టి.గన్నవరం గ్రామంలోని రామాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహణకు స్థానిక మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.30 వేల విరాళాన్ని చెక్కు రూపంలో ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ ఆలయ కమిటీ సభ్యులకు శుక్రవారం తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సుధ మాట్లాడుతూ ట్రస్ట్ సేవా కార్యక్రమాలను వివరించారు. కమిటీ అధ్యక్షులు బండారు వెంకట్రావు, టి.గన్నవరం రైతులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌ల అందజేత



తిరువూరు: గత మార్చిలో జరిగిన ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన పలువురు విద్యార్థినులకు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు శుక్రవారం ల్యాప్‌టాప్‌లు అందజేశారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. దారా టౌన్‌షిప్‌లోని ఎమ్మెల్యే నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు పథకాలు అందించాలి



ఇబ్రహీంపట్నం: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అందించాలని సీఐటీయూ ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి ఎం.మహేష్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ బోర్డు ద్వారా పెండింగ్‌లో ఉన్న క్లైములు అమలు చేసేందుకు తక్షణం లేబర్ కమిషనర్‌కు ఆదేశాలు ఇవ్వాలన్నారు. ప్రమాదాల్లో గాయపడిన, మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు భవన నిర్మాణ కార్మికులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పెండ్యాల వెంకటేశ్వరరావు, పల్లె కంటి వీరయ్య, శ్రీకాంత్, ఫిరోజ్, రాజా పాల్గొన్నారు.

పాఠశాల పునఃప్రారంభం



చాట్రాయి: కొత్తగూడెం శివారు యర్రవారిగూడెం ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈఓ బ్రహ్మచారి పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది విద్యార్థులు లేకపోవడంతో పాఠశాలను తాత్కాలికంగా మూసి వేశామని, ప్రస్తుతం ముగ్గురు విద్యార్థులు చేరడంతో తిరిగి పాఠశాలను ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మంచిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలు వేలం వాయిదా

బలివే(ముసునూరు): బలివే రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన సేద్యపు భూముల కౌలుకు వేలం జూలై 6వ తేదీన నిర్వహిస్తామని ఆలయ ఈఓ సతీష్ కుమార్ తెలిపారు. శుక్రవారం వేలం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. కౌలు రైతులు ఎవ్వరూ వేలానికి హాజరు కాలేదు. జూలై నెల 6న ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. రైతులు డిపాజిట్ చెల్లించి, వేలంలో పాల్గొనాలని కోరారు.

క్రిమినల్ చట్టాలపై పుస్తకాల పంపిణీ


న్యాయవాదులకు పుస్తకాలు అందజేస్తున్న జడ్జి శివపార్వతి

మైలవరం: బ్రిటిష్ కాలం నాటి చట్టాన్ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం మూడు కొత్త క్రిమినల్ చట్టాలను జూలై 1వ తేదీ నుంచి అమలు చేయనుందని మైలవరం సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ ఎం. శివపార్వతి అన్నారు. మైలవరం జూనియర్ సివిల్ కోర్టు ప్రాంగణంలో ఈ చట్టాలపై అవగాహనకు న్యాయవాదులకు ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యులు బీవీ కృష్ణారెడ్డి సౌజన్యంతో మైలవరం బార్ అసోసియేషన్ న్యాయవాదులకు పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. జడ్జి శివపార్వతి మాట్లాడుతూ ఇప్పుడున్న ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, భారతీయ సాక్ష్య చట్టంల స్థానంలో భారతీయ న్యాయ సంహిత 2023, భారతీయ సురక్ష సంహిత 2023, భారతీయ సాక్ష్యా అధ్యయనం 2023లను జూలై 1వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు తెలిపారు. న్యాయవాదులకు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీ ప్రసాద్, వీటీ కిశోర్ ఆధ్వర్యంలో మైలవరం సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ ఎం. శివ పార్వతి ద్వారా పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

మిరప నర్సరీ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న ఉద్యానశాఖ జిల్లా అధికారి బాలాజీ

ఊటుకూరు(గంపలగూడెం): మిరప నర్సరీ నిర్వాహకులు నిబంధనలు తప్పక పాటించాలని ఉద్యాన శాఖ జిల్లా అధికారి పి. బాలాజీ అన్నారు. ఊటుకూరు రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో విత్తన, నర్సరీ చట్టాలపై షేడ్, నెట్ నర్సరీ నిర్వాహకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం నర్సరీ చుట్టూ ఇన్సెక్టర్‌నెట్, డబుల్ డోర్ కచ్చితంగా ఏర్పాటు చేయాలని, మూడు అడుగుల విస్తీర్ణం వరకు ఎలాంటి కలుపు మొక్కలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. నర్సరీకి సంబంధించి ఏడు రకాల రికార్డులను ఏ విధంగా నిర్వహించాలో వివరించారు. నారు విక్రయించే సమయంలో రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. వ్యవసాయశాఖ తిరువూరు ఏడీ కెనడీ మాట్లాడారు. మండల వ్యవసాయాధికారి బి. సాయిశ్రీ, తిరువూరు హెచ్‌ఓ సోహెల్ అహ్మద్, మండల పరిధిలోని నర్సరీల యజమానులు పాల్గొన్నారు.

బాలికల గురుకులంలో ఎంఈఓ తనిఖీలు



ముసునూరు: స్థానిక బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వసతి, సౌకర్యాలను పరిశీలించారు. భోజన పదార్థాల నాణ్యతను పరిశీలించి మెనూ ప్రకారం ఆహారాన్ని విద్యార్థులకు వడ్డించాలని ప్రిన్సిపాల్ కొండాబత్తుల ప్రవీణకు సూచించారు. అనంతరం విద్యార్థినుల తాగునీటి సరఫరా ట్యాంకర్లను ఆయన పరిశీలించారు. నూతనంగా పాఠశాలలో చేరిన ఐదో తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. ఉపాధ్యాయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీపీ పాలడుగు జోత్స్నకు సత్కారం



ఇబ్రహీంపట్నం: ఇటీవలి కాలంలో నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ శిక్షణ తరగతులకు హాజరై వచ్చిన ఎంపీపీ పాలడుగు జోత్స్నను డీపీఆర్టీయూ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. డెమోక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్బర్‌పాషా నేతృత్వంలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీని కలిసి శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛం, మెమెంటో అందజేసి అభినందనలు తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఇర్ఫాన్‌పాషా, కార్యదర్శి బాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నూజివీడు: ఎంఎస్‌పాలెంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం కమ్ముల యేషయ్య మహాసేన ఆధ్వర్యంలో రాత పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్నాక్స్ పంపిణీ చేశారు. యేషయ్య మాట్లాడుతూ సమానత్వం అనేది ధనంతో కాదని, విద్యతోనే సాధ్యమవుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా ఉన్నత విద్య వరకు చదివించాలని సూచించారు. విద్య ద్వారానే పేదల జీవితాల్లో మార్పు సాధ్యమవుతుందన్నారు. హెచ్‌ఎం టి. నాగరాజు, ఉపాధ్యాయిని డి. కనకకుమారి, గ్రామానికి చెందిన మానికొండ రాంబాబు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో డయేరియాకు ప్రత్యేక విభాగం



నూజివీడు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో డయేరియా బాధితులకు చికిత్సను అందించేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. నరేంద్రసింగ్ శుక్రవారం తెలిపారు. డయేరియా బాధితులు ఆలస్యం చేయకుండా వెంటనే వచ్చి ఆస్పత్రిలో చేరితే వారికి మెరుగైన చికిత్సను అందిస్తామన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీలోని 10 వార్డు సచివాలయాల పరిధిలో జూలై ఒకటో తేదీన సామాజిక పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం చేశామని మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం పింఛన్‌దారులు 5,262 మంది ఉన్నారని చెప్పారు. పింఛన్ల పంపిణీకి వార్డు సచివాలయ ఉద్యోగులు 103 మందిని ఎంపిక చేశామన్నారు. ప్రతి 50 కుటుంబాలకు ఒక ఉద్యోగిని నియమించామని కమిషనర్ పేర్కొన్నారు.

- **ఆగిరిపల్లి:** మండలంలో జూలైలో అందించాల్సిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బంది పింఛన్ లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేస్తారని ఎంపీడీఓ శామ్యూల్ తెలిపారు. మండలంలో 9,815 పింఛన్ లబ్ధిదారులకు రూ.4,000తోపాటు ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉన్న ఎరియర్స్ రూ.3,000 కలిపి రూ.7,000 అందిస్తామని చెప్పారు.

ఉపాధ్యాయ వృత్తికి వన్నె తేవాలి



తిరువూరు: ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసి వృత్తికి వన్నె తేవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్ అన్నారు. ఇటీవల పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు రాంబాబును జేవీవీ సభ్యులు తిరువూరులో శుక్రవారం సత్కరించారు. ఆయన మాట్లాడుతూ సమాజానికి దిక్సూచిగా ఉపాధ్యాయులు నిలవాలన్నారు. వృత్తిపరంగా ఎన్ని అవాంతరాలు ఎదురైనా నిబద్ధతతో పనిచేసిన వారు పదవీ విరమణ చేసినా విద్యార్థుల ఆదరాభిమానాలు పొందుతారని చెప్పారు. జేవీవీ సభ్యులు రాంప్రదీప్, సుదర్శన్, సుధాకర్, శీనయ్య, శోభన్‌బాబు, భరతకుమారి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

తిరువూరు: తిరువూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరుగుతుందని ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. ఎంపీపీ గద్దల భారతి అధ్యక్షతన మధ్యాహ్నం 2.30 గంటలకు జరిగే సర్వసభ్య సమావేశంలో అజెండాలోని అంశాలపై మండలంలోని ఎంపీటీసీ సభ్యులు చర్చిస్తారని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమావేశానికి విధిగా హాజరుకావాలని కోరారు.

- **గంపలగూడెం:** గంపలగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ గోగుల మూడి శ్రీలక్ష్మి అధ్యక్షతన జరుగనున్న సమావేశానికి అన్ని శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరుకావాలని కోరారు.

ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు తొలగించాలి

ప్రజాదర్బార్‌లో ముదిగొండ వినతి


ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు సమస్యలు చెబుతున్న నిరుద్యోగులు

తిరువూరు: తిరువూరు పట్టణంలోని నాగార్జునసాగర్ క్యాంపు కాలనీలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమణల చెర నుంచి తొలగించాలని సామాజిక కార్యకర్త ముదిగొండ దుర్గాప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం జరిగిన ప్రజాదర్బార్‌లో ఆక్రమణలపై ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. 2009లో రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వోద్యోగుల సహకార సంఘాలకు అతి తక్కువ ధరపై 5.13 ఎకరాల భూమిని నివేశన స్థలాల నిమిత్తం కేటాయించిందని, మూడు ఉద్యోగుల సహకార సంఘాలు నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల స్థలాలను విక్రయించాయని ఆరోపించారు. కోట్లాది రూపాయల విలువైన భూములను అనధికారిక వ్యక్తులకు సహకార సంఘాలు కేటాయిస్తున్నందున చట్టప్రకారం చర్యలు తీసుకుని విలువైన భూములను కాపాడాలని కోరారు.

నిరుద్యోగ అభ్యర్థుల మెమోరాండం

ఖాళీ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకునే విధంగా చూడాలని తిరువూరు నియోజకవర్గంలోని నిరుద్యోగ అభ్యర్థులు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావుకు ప్రజాదర్బార్‌లో వినతిపత్రం సమర్పించారు. కానిస్టేబుల్స్, డీఎస్సీ తదితర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేసేందుకు ప్రభుత్వానికి నివేదించాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి మహిళలు, యువకులు తమ సమస్యలు వివరిస్తూ ఎమ్మెల్యేకి వినతిపత్రాలను అందజేశారు. వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి అధికారులకు తగు సూచనలిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తిరువూరు పోలీస్ సీఐ అబ్దుల్ నబీ, ఎస్ఐలు, తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఏకొండూరు మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, వ్యవసాయ, అంగన్‌వాడీ, సాంఘిక సంక్షేమ, విద్యా, వైద్యారోగ్య శాఖల అధికారులు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

గొప్ప దార్శనికుడు పీవీ నరసింహారావు

జయంతి కార్యక్రమంలో పలువురి నివాళి


మైలవరంలో నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

మైలవరం: ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిన గొప్ప దార్శనికుడు పీవీ నరసింహారావు అని పలువురు వక్తలు కొనియాడారు. భారత దేశ మాజీ ప్రధాని, బహు భాషా కోవిదుడు దివంగత పీవీ నరసింహారావు జయంతి కార్యక్రమం మైలవరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మైలవరం బోసు బొమ్మ సెంటర్‌లో పీవీ నరసింహారావు చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ పీవీ నరసింహారావు దక్షిణ భారతదేశం నుంచి రాజకీయాల్లో ప్రావీణ్యం కలిగి, రాష్ట్ర రాజకీయాల్లో నుంచి దేశ రాజకీయాల్లోకి ఎదిగి తొలి తెలుగు ప్రధానిగా ఎన్నిక కావడం విశేషమన్నారు. భారతదేశానికి ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించారని కొనియాడారు. భారత దేశానికి తొలిగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించిన మహోన్నత వ్యక్తి అని వివరించారు. కార్యక్రమంలో నాయకులు శీలం రామకృష్ణ, దోసపాటి గిరిధర్ కుమార్, అన్నవరపు దుర్గారావు, పిట్టల నాగేశ్వరరావు, కొత్తగుండ్ల ఆంజనేయులు, శీలం సుధాకర రెడ్డి, బండి చంటి తదితరులు పాల్గొన్నారు.

- **పెనుగొలను(గంపలగూడెం):** పెనుగొలనులో షిర్డీ సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ తెలుగువాడైన నరసింహారావు రాష్ట్రాభివృద్ధికి, దేశాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దు


మాట్లాడుతున్న జడ్జి మోతీలాల్ నాయక్

తిరువూరు: విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ నాయక్ అన్నారు. స్థానిక వాహిని కాలేజీలో శుక్రవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిరోధంపై మండల లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. జడ్జి మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ గంజాయి, హెరాయిన్ తదితర మత్తు పదార్థాలు యువతను పెడత్రోవ పట్టిస్తాయని, వీటికి బానిసలైన వారిని సమాజం చిన్నచూపు చూస్తుందని చెప్పారు. మాదక ద్రవ్యాలు నేర ప్రవృత్తిని ప్రోత్సహిస్తాయని, విద్యార్థులు విలువైన జీవిత కాలాన్ని నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జడ్జి సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకదాని లక్ష్మీనారాయణ, న్యాయవాదులు సంకురాత్రి జనార్దనరావు, రాజవరపు శ్రీనివాసరావు, కళాశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాక్సినేషన్



పెద్దకొమిర(గంపలగూడెం): పశువులకు గాలికుంటు, గురక, జబ్బవాపు వ్యాధులు సోకకుండా పశుపోషకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తిరువూరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ పి. సాంబమూర్తి అన్నారు. గంపలగూడెం మండలం పెద్ద కొమిర పాల ఉత్పత్తిదార్ల పరస్పర సహాయ, సహకార కేంద్రంలో గాలికుంటు, గురక, జబ్బవాపు వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తగా పశువులకు ఉచితంగా వ్యాక్సిన్ పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి పశుపోషకులకు పలు సూచనలు చేశారు. జిల్లా ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ పల్నాటి సత్యనారాయణ, వైద్యులు సోహెల్ అహ్మద్, కృష్ణారెడ్డి, సూపర్‌వైజర్ బి. నరసింహారావు, కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

తిరువూరు: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ నాయక్ తెలిపారు. ఉదయం 10 గంటలకు కోర్టు ఆవరణలో జరుగనున్న లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోదగిన సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరిస్తామన్నారు.

జూదరుల అరెస్ట్

రెడ్డిగూడెం: రుద్రవరం గ్రామ శివారులోని బహిరంగ ప్రదేశంలో పేకాట శిబిరంపై రెడ్డిగూడెం ఎస్ఐ గణేష్ శుక్రవారం సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఎనిమిదిమందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 52,020 నగదును, ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాయనపాడు ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ తెలిపారు. రాయనపాడు పంచాయతీ ఆఫీస్, యాదవుల బజారు, అలంకార్ బీరువా కంపెనీ, పైడూరుపాడులో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

బాలరావమ్మను దర్శించుకున్న మంత్రి పార్థసారథి

ఆగిరిపల్లి: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తోటపల్లిలోని దుగ్గిరాల బాల రావమ్మ తల్లిని శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గురువారం ఈదరలో విద్యుదాఘాతంతో మరణించిన తల్లి, కొడుకు, దొండపాటి నాగరత్నం, రామదాసు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

నేడు నగర పంచాయతీ సమావేశం

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం జరుగుతుందని చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి తెలిపారు. పట్టణంలో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై సమావేశంలో చర్చిస్తారన్నారు. ఉదయం 11 గంటలకు జరుగనున్న సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొనాలని కోరారు.

చిన్నంపేటలో పారిశుద్ధ్య పనులు



చాట్రాయి: చిన్నంపేటలో శుక్రవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా డ్రెయినేజీల్లో మురుగు, మెయిన్ రోడ్డు పక్కన ఉన్న చెత్త తొలగించి బ్లీచింగ్ చల్లించారు. కార్యక్రమంలో సర్పంచ్ పరసా ధనలక్ష్మి, కార్యదర్శి నిస్సాక్ ఆలీ, ఏఎన్ఎం పాల్గొన్నారు.